క్లుప్తంగా

శ్రీనివాసునికి పంచామృత అభిషేకాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మార్గశిర ఏకాదశి, ధనుర్మాసాన్ని పురస్కరించుకుని చిట్టినగర్‌లో వేంచేసిన శ్రీ పద్మావతి, గోదాదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి సన్నిధిలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున స్వామి వారికి సుప్రభాత సేవ, ఆలయ ప్రాంగణంలోని ఆస్థాన కల్యాణ మండపంలో ఉత్సవ మూర్తికి పంచామృత అభిషేకాలు జరిగాయి. అనంతరం మూలవిరాట్‌కు తులసీ దళ అర్చనలు, పంచ హారతుల సేవ నిర్వహించారు.

ఉద్యమాలతోనే చారిత్రక విజయాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): దేశంలో కమ్యూనిస్టు ఉద్యమాలతోనే పలు చారిత్రక విజయాలు సొంతమయ్యాయని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అన్నారు. సీపీఐ శత వార్షికోత్సవం సందర్భంగా మున్సిపల్ కార్యాలయం సమీపంలో ఏఐటీయూసీ పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమానికి యూనియన్ ప్రధాన కార్యదర్శి బుద్దే రాజా నాయకత్వం వహించారు. వన్‌టౌన్ చేపల మార్కెట్ సెంటర్‌లో సీపీఐ 53, 37 డివిజన్ల ఇన్‌చార్జి కొట్టు రమణారావు ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం వద్ద పతాక ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది.

ఘనంగా సీపీఐ శత వార్షికోత్సవం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) శత వార్షికోత్సవాలను పురస్కరించుకుని 48వ డివిజన్‌లో పార్టీ జెండాను నేతలు ఆవిష్కరించారు. కొత్తపేట ఆంజనేయ వాగు సెంటర్, సొరంగం రోడ్డులోని పార్టీ కార్యాలయం వద్ద డివిజన్ కార్యదర్శి కె.వెంకటేశ్వరరావు, మందపాక శ్రీను పార్టీ జెండాలను ఆవిష్కరించారు. ఆంజనేయ వాగు సెంటర్‌లో పార్టీ పతాకాన్ని కొరికాని నీలంనాయుడు ఆవిష్కరించారు.

బ్లేడ్‌తో గాయపరుచుకున్న భర్త

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భార్యను బెదిరించేందుకు భర్త తనకు తాను బ్లేడ్‌తో గాయపరుచుకున్న ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని జక్కంపూడి కాలనీలో గురువారం జరిగింది. ఘటనపై సేకరించిన వివరాల ప్రకారం కాలనీకి చెందిన గుమ్మలపూడి శివ చైతన్య అలియాస్ నానికి భార్యతో విభేదాలున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం తెల్లవారుజామున కాలనీ మెయిన్‌రోడ్డు వద్ద నాని బ్లేడ్‌తో తనను తాను గాయపరుచుకుని రక్తపు మడుగులో పడిపోయాడు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు, స్థానికులు హుటాహుటిన శివచైతన్యను ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మహానటి సావిత్రి సినీ రంగ సేవలు వెలకట్టలేనివి



విజయవాడ కల్చరల్: మహానటి సావిత్రి సినీ రంగసేవలు వెలకట్టలేనివని మహానటి సావిత్రి సంక్షేమ సంఘం వ్యవస్థాపకురాలు పరుచూరి విజయలక్ష్మి అన్నారు. మహానటి సావిత్రి, సాంస్కృతిక సేవా సంఘం ఆధ్వర్యంలో తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో గురువారం సావిత్రి వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. విశ్రాంత పోలీస్ అధికారి కె.డేవిడ్ రాజు మాట్లాడుతూ సావిత్రి నటజీవితాన్ని నేటి నటులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. వివిధ సంస్థల ప్రతినిధులు ప్రభల శ్రీనివాస్, వడ్డాది కామేశ్వరి, ఉమామహేశ్వరరావు, వెంకటరమణ, చలపతి, పైడిపాటి వెంకన్న పాల్గొన్నారు.

హెల్మెట్ లేకుండా బైక్ నడిపితే చర్యలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): హెల్మెట్ లేకుండా బైక్ నడిపే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని వెస్ట్ ఏసీపీ ఎస్‌ఎస్‌వీకే దుర్గారావు హెచ్చరించారు. కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీనివాస మహల్ సెంటర్‌లో ద్విచక్ర వాహనాలను, ఆటోల రికార్డులను గురువారం ఏసీపీ దుర్గారావు పర్యవేక్షణలో సీఐ కొండలరావు తనిఖీ చేశారు. హెల్మెట్ లేకుండా బైక్‌లను నడుపుతున్న యువకులకు కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు నిబంధనలను అతిక్రమించి వాహనాలు నడిపిన వారిపై జారీ చేసిన చలానాలను పరిశీలించారు. చలానాలను తక్షణమే చెల్లించాలని, చలానాల మొత్తాన్ని ఎలా చెల్లించాలో తెలియని వారు దగ్గరలోని పోలీస్ స్టేషన్‌కు వెళితే పోలీసు సిబ్బంది సహకరిస్తారని సూచించారు.

పేర్లు మార్పు తప్ప అభివృద్ధి శూన్యం

- మారిపోతున్న పార్కుల పేర్లు, ఆరోగ్య కేంద్రం బోర్డులు
- ఆరునెలల కాలంలో ఇదీ కూటమి ప్రభుత్వ తీరు



వైఎస్సార్ పేరు తొలగించి పార్క్‌కు వాజ్‌పేయి పేరుతో బోర్డు ఏర్పాటు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పార్కులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పేర్లు మార్చడం తప్ప అభివృద్ధి ఎక్కడా కానరావడం లేదు. గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన బోర్డులు మార్చడమే పనిగా పెట్టుకున్నారు. కొత్తగా నామ ఫలకాలు ఏర్పాటు చేస్తున్నారు. తాము అధికారంలోకి వచ్చేనాటికే పూర్తి చేసిన వాటిని ప్రారంభించడం, ప్రారంభించిన వాటిని పునః ప్రారంభించడం నామ ఫలకాలు ఆవిష్కరించడం రివాజుగా మారింది. అధికారం చేపట్టి ఆర్నెల్లు గడుస్తున్నా ఇప్పటికీ చెప్పుకోదగిన పని ఒక్కటీ చేయలేదు. ఎన్నికల ఫలితాలు వచ్చీ రాగానే భవానిపురం క్రాంబే రోడ్డులోని వైఎస్సార్ పార్క్‌లో మహానేత వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. వైఎస్సార్ పేరులోని అక్షరాలను తొలగించారు. తాజాగా వైఎస్సార్ పార్క్ పేరునే మార్చి వేశారు. వాజ్‌పేయి పుట్టిన రోజు సందర్భంగా ఎమ్మెల్యే సుజనా చౌదరి పార్క్‌లో వాజ్‌పేయి విగ్రహాన్ని ఆవిష్కరించి, వాజ్‌పేయి పార్క్‌గా నామకరణం చేసి ఆ పేరుతో బోర్డు ఏర్పాటు చేశారు. వాస్తవానికి భవానిపురం క్రాంబే రోడ్డులో పార్క్ 2014–19 మధ్య పూర్తి నిరాదరణకు గురైంది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే ఆ పార్క్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసింది. పచ్చదనం కోసం మొక్కలు, వాకింగ్ ట్రాక్, ఆట వస్తువులు, మరుగుదొడ్లు నిర్మించింది. పార్క్‌కు వైఎస్ రాజశేఖరరెడ్డి పేరు పెట్టింది. సకల సౌకర్యాలతో తీర్చిదిద్దడంతో ఆ పరిసర ప్రాంతాల్లోని వందల మంది పార్క్‌లో ఉదయం, సాయంత్రం వాకింగ్ చేస్తున్నారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పార్క్‌లో ఏ ఒక్క అభివృద్ధి కార్యక్రమం చేపట్టలేదు. కానీ వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. ఇప్పుడు ఆయన పేరును కూడా మార్చివేశారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్ర బోర్డు తొలగింపు

42 వ డివిజన్‌లో గత ప్రభుత్వం రూ.కోటి నిధులతో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మించింది. ఆ ప్రాంత వాసులకు ఆరోగ్య భద్రత కల్పించింది. ఈ కేంద్రాలకు డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగా నామకరణం చేశారు. అప్పటివరకు ప్రైవేటు ఆరోగ్య కేంద్రాలకు వెళ్లిన స్థానికులు ఆరోగ్య కేంద్రాన్ని చక్కగా సద్వినియోగం చేసుకుంటున్నారు. ఆరోగ్య కేంద్రంలో మరిన్ని సౌకర్యాలు కల్పించే అవకాశం ఉంది. ఆరోగ్య కేంద్రాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. కానీ కూటమి ప్రభుత్వం అవేవీ పట్టించుకోవడం లేదు. డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం అని ఉన్న బోర్డును తొలగించి కొత్త బోర్డు ఏర్పాటు చేసింది. భవానీపురంలో పగోడ, రోజ్ పార్క్‌లు గత ప్రభుత్వం అభివృద్ధి చేసింది. వాటిని ప్రారంభించినట్లు కూటమి నేతలు నామ ఫలకాలు ఏర్పాటు చేసుకున్నారు.

అదనపు ఖర్చు తప్ప ప్రయోజనం లేదు

బోర్డులు, పేర్లు మార్పుపై పెట్టిన శ్రద్ధ అభివృద్ధిపై పెట్టాలని తటస్థులు అంటున్నారు. బోర్డులు మార్చడం వలన అదనపు ఖర్చు తప్ప ప్రయోజనం ఏముంటుందని ప్రశ్నిస్తున్నారు. నియోజకవర్గంలో మిగిలిపోయిన పనులు ఏవైనా ఉంటే వాటిని చేయాలే తప్ప ఇలా పేర్లు మార్చడం ఏమిటని పెదవి విరుస్తున్నారు.

ప్రజల మనస్సుల్లో వీఎం రంగా సుస్థిర స్థానం

నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి



రంగా విగ్రహం వద్ద పేదలకు పండ్లు పంపిణీ చేస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రజా సమస్యలపై పోరాడుతూ తన ప్రాణాలను సైతం అర్పించిన దివంగత శాసనసభ్యుడు వంగవీటి మోహన రంగారావు అన్ని వర్గాల ప్రజల మనస్సుల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. వీఎం రంగా వర్ధంతి సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు గొంది ప్రసాద్, వి.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం విద్యాధరపురం 44వ డివిజన్ పరిధిలోని చెరువు సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత వీఎం రంగా, మహాత్మా గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ రంగా భౌతికంగా మరణించి మూడున్నర దశాబ్దాలు గడిచినా ప్రజల గుండెల్లో నేటికీ జీవించే ఉన్నారని అన్నారు. రంగా ఒక వ్యక్తి కాదని, ఒక శక్తిగా అభివర్ణించారు. రంగా ఆశయాలకు వైఎస్సార్ సీపీ కట్టుబడి ఉందని చెప్పారు. అనంతరం ఆమె పేదలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వి.లీలా మధు, బొండా నారాయణరావు, బొండా నిరీష్, ఆర్.అయ్యప్ప, విజయబాబు పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు గొంది ప్రసాద్, వి.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో విద్యాధరపురం చెరువు సెంటర్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత పోతిన మహేష్ మాట్లాడుతూ రంగా యువతలో ఉద్యమ స్ఫూర్తిని నింపారన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాల్సిన వ్యక్తులు కేవలం కుటుంబ వారసులుగానే మిగిలిపోవడం దురదృష్టకరమన్నారు.

సితార జంక్షన్‌లో వీఎం రంగా విగ్రహావిష్కరణ



రంగా విగ్రహావిష్కరణలో వంగవీటి రాధా తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ):విద్యాధరపురం సితార జంక్షన్‌లో ఏర్పాటు చేసిన దివంగత శాసనసభ్యుడు వంగవీటి మోహన రంగారావు విగ్రహాన్ని ఆయన తనయుడు రాధాకృష్ణ గురువారం రాత్రి ఆవిష్కరించారు. తన తండ్రి రంగా జీవితం తనకు ఆదర్శమని రాధ అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జలీల్‌ఖాన్, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, వీఎం రంగా విగ్రహ కమిటీ సభ్యులు పత్తి నాగేశ్వరరావు, మైలవరపు కృష్ణ, మైలవరపు దుర్గారావు, లింగం శివప్రసాద్, కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి, తిరుపతి అనూష, బొమ్మసాని సుబ్బారావు, చెన్నుపాటి శ్రీను, బుల్లెట్ ధర్మారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పేద మహిళలకు చీరెలు పంపిణీ చేశారు.

పోతిన చిన్నా విగ్రహ ప్రతిష్టకు తీర్మానంపై హర్షం



మేయర్‌కు ధన్యవాదాలు తెలుపుతున్న ఏపీ నగరాల సంఘం రాష్ట్ర కార్యవర్గం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, కార్మిక నేత పోతిన చిన్నా విగ్రహాన్ని కేటీ రోడ్డులో ఏర్పాటు చేయటానికి నగర పాలక సంస్థ కౌన్సిల్ ఆమోదం తెలపటంపై ఆంధ్రప్రదేశ్ నగరాల సంఘం నేతలు మేయర్ రాయన భాగ్యలక్ష్మికి ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాయన బాబూజీ (బాజ్జీ), పోతిన వెంకటేశ్వర స్వామి, మాజీ అధ్యక్షుడు బాయన వెంకట్రావు మేయర్‌ను గురువారం ఆమె చాంబర్‌లో కలిశారు. పోతిన చిన్నా విజయవాడ నగరాభివృద్ధికి, కార్మికుల సంక్షేమానికి విశేష కృషి చేశారని వివరించారు. అటువంటి నాయకుని విగ్రహాన్ని ఏర్పాటు చేయటానికి కౌన్సిల్ సమావేశం ఆమోదం తెలపటంలో సహకరించినందుకు మేయర్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి పోతిన చిన్నా సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సంఘం నేతలు ఈది సూరిబాబు, బెవర శ్రీనివాసరావు, వాండ్రాసి సూర్యప్రకాశరావు, పోతిన భాస్కరరావు, మజ్జి శ్రీనివాసరావు, తమ్మిన దివాకరం, బైపిళ్ళ ముత్యాలరావు పాల్గొన్నారు.

నేడు పశ్చిమంలో వైఎస్సార్ సీపీ పోరుబాట

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో విద్యుత్ చార్జీల బాదుడుపై వైఎస్సార్ సీపీ చేపట్టిన పోరుబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉదయం 10.30 గంటలకు మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు నేతృత్వంలో గట్టు వెనుక ప్రాంతంలోని ఊర్మిళానగర్‌లో గల వైఎస్సార్ విగ్రహం వద్ద నుంచి ర్యాలీ నిర్వహించనున్నారు. అక్కడ నుంచి ఏకలవ్యనగర్ మీదుగా 45వ డివిజన్ పరిధిలోని జోజినగర్ (రామరాజ్యనగర్) కరెంట్ ఆఫీస్ వరకు ర్యాలీ కొనసాగుతుంది. అక్కడ ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్‌లో అధికారులను కలిసి పెంచిన కరెంట్ చార్జీలు తగ్గించాలని కోరుతూ వినతిపత్రం అందజేయనున్నారు. పశ్చిమ నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులంతా ఈ కార్యక్రమానికి తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు కార్యాలయం గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది.

టీసీఎస్‌కు కేబీఎన్ విద్యార్థుల ఎంపిక



టీసీఎస్‌కు ఎంపికైన విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి తదితరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ టీసీఎస్ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో తమ కళాశాలకు చెందిన 21 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కేబీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి తెలిపారు. కళాశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ టి.శ్రీనివాసు, హిందూ హైస్కూల్స్ కమిటీ ఏవో డాక్టర్ వి.నారాయణరావు తదితరులు అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.వేంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, డాక్టర్ కె.రామకృష్ణ పాల్గొన్నారు.

నెట్‌బాల్ పోటీలకు కేబీఎస్ విద్యార్థులు

ఇటీవల ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో జరిగిన కృష్ణా విశ్వవిద్యాలయ అంతర్ కళాశాలల పురుషుల నెట్ బాల్ టోర్నమెంట్‌లో తమ కళాశాల జట్టు అద్భుతమైన ప్రదర్శన కనబరిచి యూనివర్సిటీ చాంపియన్‌గా నిలిచారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి తెలిపారు. త్వరలో రాజస్థాన్‌లో జరిగే అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల పురుషుల నెట్ బాల్ పోటీలకు తమ విద్యార్థులు వై.సాయి, ఎస్‌కే యాసిన్, బి.దుర్గాప్రసాద్, కె.అభిషేక్ ఎంపికయ్యారని తెలిపారు.

పోగొట్టుకున్న ప్రయాణికురాలి బ్యాగు అందజేత



పోగొట్టుకున్న బ్యాగును బాధితురాలికి అందజేస్తున్న జీఆర్‌పీ సీఐ, సిబ్బంది

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, నగదు కలిగిన బ్యాగును రైలులో మర్చిపోయిన ఘటనపై అందిన ఫిర్యాదు మేరకు విజయవాడ జీఆర్‌పీ పోలీసులు సకాలంలో స్పందించారు. విజయవాడ రైల్వే స్టేషన్‌లో ఆగిన రైలులో బ్యాగును గుర్తించి దానిని సురక్షితంగా ప్రయాణికురాలికి అందజేశారు. వివరాలిలా ఉన్నాయి. ఏలూరుకు చెందిన మేళం రేవతి సత్య అనే మహిళ గురువారం విశాఖపట్నం నుంచి ప్రయాణం చేస్తూ సామర్లకోటలో తన ట్రావెల్ బ్యాగును రైలులోనే మర్చిపోయి దిగింది. అనంతరం ఆ విషయం గుర్తించి అక్కడ జీఆర్‌పీ పోలీసుల సహకారంతో విజయవాడ జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ జి.వి.రమణకు ఫోన్ ద్వారా సమాచారం అందించింది. వెంటనే స్పందించిన సీఐ సిబ్బందితో ఆమె చెప్పిన రైలులో తనిఖీలు చేసి బ్యాగును స్వాధీనం చేసుకున్నారు. బాధితురాలు విజయవాడ చేరుకోగా బ్యాగులోని బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, రూ.20వేల నగదు కలిగిన బ్యాగును ఆమెకు అందజేశారు. పోయిందనుకున్న బ్యాగును సురక్షితంగా తనకు అందించినందుకు ఆమె పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు.

రేపు పీఎస్‌సీఎంఆర్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో 'సినర్జీ' పేరుతో ఈ నెల 28వ తేదీన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శరవణకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో కార్యక్రమం ఆహ్వాన పత్రికను ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ తమ కళాశాలలో 2008 నుంచి చదువుకున్న విద్యార్థులు ప్రముఖ బహుళ జాతీయ సంస్థలైన ఇన్ఫోసిస్, మైక్రోసాఫ్ట్, ఐబీఎం, టీసీఎస్, హెచ్‌సీఎల్, సదర్లాండ్, బైజూస్, మిట్సోగో, స్నోవాసిస్ వంటి సంస్థల్లో ముఖ్య బాధ్యతలు నిర్వహిస్తున్నారన్నారు. సుమారు 200 మందికి పైగా పూర్వ విద్యార్థులు హాజరవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ రావూరి సుబ్బారావు (దత్తా) ముఖ్య అతిథిగా, కళాశాల అధ్యక్షుడు చలవాది మల్లికార్జునరావు గౌరవ అతిథిగా, కార్యదర్శి చిట్టా అమర్ సుధీర్ ఆత్మీయ అతిథిగా హాజరవుతారని వివరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ పతంజలిశాస్త్రి, డాక్టర్ సురేష్‌బాబు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

త్వరిత వాణిజ్య సౌలభ్యానికి స్విగ్గీ ఇన్‌స్టామార్ట్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విజయవాడ ప్రజలు త్వరిత వాణిజ్య సౌలభ్యం కోసం స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ వైపు మొగ్గు చూపుతున్నారని ఆ సంస్థ సీఈవో అమితేష్ ఝా పేర్కొన్నారు. 2022లో ఇన్‌స్టామార్ట్ విజయవాడలో ప్రారంభించినప్పటి నుంచి విజయవంతంగా దూసుకుపోతోందని తెలిపారు. నగర వినియోగదారులకు కిరాణా సరుకులు, ఎలక్ట్రానిక్స్, వారికి అవసరమైన ప్రతి దానిపై 10 నిమిషాల్లో డెలివరీ చేస్తున్నామన్నారు.

మరింత రమణీయంగా సామాజిక న్యాయ మహాశిల్పం

స్టీరింగ్ కమిటీ సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ నడిబొడ్డున నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల సామాజిక న్యాయ మహాశిల్ప సందర్శనకు వచ్చేవారికి మరింత మధురానుభూతి మిగిల్చేలా ఏర్పాట్లు మెరుగుపరుస్తామని కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ అన్నారు. ఇందుకు సంబంధించి పటిష్ట ప్రణాళికతో ప్రతిపాదనల రూపకల్పనకు కసరత్తు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. గురువారం అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం, స్మృతి వనానికి సంబంధించి కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన స్టీరింగ్ కమిటీ సమావేశం జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న సందర్శకులు, వాహనాల పార్కింగ్ ప్రాంత విస్తరణ, ఫౌంటేన్లు, ఆర్‌వో ప్లాంట్, చిల్డ్రన్ ప్లే ఏరియా తదితరాలతో పాటు సుస్థిర నిర్వహణ పరంగా భవిష్యత్తులో చేపట్టాల్సిన పనులపై చర్చించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ నిధి మీనా, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్, విజయవాడ ఆర్‌డీవో కె.చైతన్య, జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి శిరోమణి, ఏపీఐఐసీ జెడ్‌ఎం కె.బాబ్జీ, కేపీసీ ప్రాజెక్ట్ లిమిటెడ్ ప్రతినిధి వాసుదేవరావు పాల్గొన్నారు.

అయ్యప్ప మండల పూజ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం (పాత శివాలయం)లో కొలువై ఉన్న శ్రీ అయ్యప్ప స్వామి వారి దేవాలయంలో మండల పూజ ముగింపు కార్యక్రమం గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

పేదలకు అన్నదానం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని రాయల్ హోటల్ సెంటర్‌లో వంగవీటి మోహనరంగా విగ్రహం వద్ద రంగా వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ మహాదేవు అప్పాజీరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్పొరేటర్లు మరుపిళ్ల రాజేష్, అర్షద్‌తో పాటుగా పలు రాజకీయ పార్టీల నేతలు పాల్గొని రంగా విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పేదలకు అన్నదానం చేశారు. తొలుత పండ్లు పంపిణీ చేశారు.

భవానీ దీక్షల విరమణ విజయవంతం



ట్రైనీ ఐపీఎస్ మనీషాకు అమ్మవారి ఫొటో, లడ్డు ప్రసాదం అందజేస్తున్న సీపీ రాజశేఖరబాబు

విజయవాడస్పోర్ట్స్: ఇంద్రకీలాద్రిపై ఐదు రోజుల పాటు జరిగిన భవానీ దీక్షల విరమణ కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు అన్నారు. బందోబస్త్ విధులకు వచ్చిన పోలీస్ అధికారులకు అమ్మవారి శేష వస్త్రం, ఫొటో, లడ్డూ ప్రసాదాన్ని కమిషనర్ అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కేఎస్ రామరావు, ట్రైనీ ఐపీఎస్ మనీషా, ఏడీసీపీలు పాల్గొన్నారు.

పేదలకు పండ్లు పంపిణీ

భవానీపురం(విజయవాడపశ్చిమ): దివంగత వంగవీటి మోహన రంగారావు వర్ధంతి సందర్భంగా నవ్యాంధ్ర కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 47వ డివిజన్ పరిధిలోగల కొప్పూరు బిల్డింగ్స్‌లో గురువారం నివాళి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పేదలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూరాకుల నాగ, కొప్పిశెట్టి వెంకటేశ్వరరావు, కోన హేమసుందర్, తిరుమలనాథుని కిరణ్‌కుమార్, మల్లెపు రాజు తదితరులు పాల్గొన్నారు.

బాబు, పవన్ ప్రజలను మోసం చేశారు

వైఎస్సార్ సీపీ నేత పోతిన మహేష్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఎన్నికల ప్రచారంలో విద్యుత్ చార్జీలు పెంచబోమని ప్రజలను నమ్మించిన చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు అధికారంలోకి వచ్చిన తరువాత రూ.15వేల కోట్ల మేర విద్యుత్ చార్జీలు పెంచి మోసం చేశారని వైఎస్సార్ సీపీ నేత పోతిన వెంకట మహేష్ మండిపడ్డారు. విజయవాడ విద్యాధరపురంలో గురువారం జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన మహేష్ ప్రజలపై ప్రభుత్వం మోపిన విద్యుత్ భారాలపై మీడియాతో మాట్లాడారు. సంపద సృష్టించడమంటే ప్రజలపై రూ.15వేల కోట్ల విద్యుత్ భారాన్ని మోపడమా అంటూ ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ఎప్పుడూ రోడ్లు వేయనట్లుగా ఇప్పుడే కొత్తగా వేస్తున్నట్లుగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కృష్ణాజిల్లాలో ఇచ్చిన బిల్డప్ చూస్తుంటే కొత్త బిచ్చోడు పొద్దెరగడన్న సామెత గుర్తుకు వస్తోందన్నారు.